క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన బీజేవైఎం నాయకులు



గవర్నర్‌కు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మొయినాబాద్: బీజేవైఎం నాయకులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం దీపావళి సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుండె గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు రాజమల్లేశ్, మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లేశ్‌గౌడ్, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు హర్షనాయక్, నాయకులు జగపతి, శంకర్, శ్రావణ్, దినేశ్, రాజశేఖర్, కేశవ్ తదితరులు గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీఓ



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న ఆర్డీఓ ఎస్ఆర్ సరిత

షాద్‌నగర్: బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ ఎస్ఆర్ సరిత శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆమె ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

ఆర్డీఓను కలిసిన టీఎన్జీఓ సంఘం నాయకులు

ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఆర్ సరితను శుక్రవారం టీఎన్జీఓ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన సంఘం నేతలు ఆర్డీఓ సరితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్‌సింగ్, తాలుకా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శి శ్రీహరి, బాలవర్ధన్, రాకేశ్‌లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



సీతక్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న భీమ్‌భరత్, నాయకులు

మొయినాబాద్‌రూరల్: దీపావళి పండుగను పురస్కరించుకొని మండల నాయకులు మంత్రి సీతక్కకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా శుక్రవారం చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జీ పామెన భీమ్‌భరత్ ఆధ్వర్యంలో పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు మాణయ్య, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు భిక్షపతి తదితరులు కలిసి ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కామారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో నాయకులు

చేవెళ్ల: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని చేవెళ్ల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కామారెడ్డిలోని ఆయన నివాసంలో కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో చేవెళ్ల నియోజకవర్గ బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, మండల నాయకులు త్రినేత్ర, ఆనంద్‌గౌడ్, జయసింహారెడ్డి, శ్రీతంరెడ్డి, సందీప్ తదితరులు ఉన్నారు.

హెచ్చరించినా తీరు మారలే!

- గ్రామపాలనలో అధికారుల నిర్లక్ష్యం
- మురుగు కాల్వల పూడికతో రోడ్డుపైనే పారుతున్న వ్యర్థజలాలు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



మినీ ట్యాంకు వద్ద పేరుకుపోయిన మురుగునీరు



ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు

షాద్‌నగర్‌రూరల్: గ్రామ పాలనలో అధికారుల నిర్లక్ష్యం.. పారిశుద్ధ్య నిర్వహణపై అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజల మురుగు సమస్యతో సతమతమవుతున్నారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సదరు పంచాయతీ కార్యదర్శి తేజస్వినిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసును జారీ చేశారు. డీపీఓ హెచ్చరించినా పంచాయతీ కార్యదర్శి తీరు మారలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

చిన్నపాటి వర్షానికే..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులను చేపట్టడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికి అవి పూర్తిగా మురుగుతో నిండిపోయాయి. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కురిసిన వర్షానికి మురుగు కాల్వ పైప్‌లైన్ నిండిపోయింది. మురుగు నీరు ఇళ్ల మధ్యలో రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

అపరిశుభ్రంగా మినీ ట్యాంకుల నల్లాలు

గ్రామంలోని మినీ ట్యాంకులను అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మినీ ట్యాంకుల వద్ద నాచు పేరుకుపోవడంతో నీళ్ల కోసం నల్లా వద్దకు వెళ్లినవారు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు హెచ్చరించినా పంచాయతీ కార్యదర్శి తీరులో మార్పు రాలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కులగణన పటిష్టంగా నిర్వహించాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



మెటీరియల్‌ను అందిస్తున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కులగణన కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఎన్యూమరేటర్లకు 6 నుంచి నిర్వహించనున్న కులగణనకు కావాల్సిన మెటీరియల్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ... మండలంలోని 29 గ్రామాల పరిధిలో 135 మంది ఎన్యూమరేట్లకు 14 మంది సూపర్‌వైజర్లు ఉన్నారన్నారు. ఇప్పటికే శిక్షణను అందించామని ఆయన గుర్తుచేశారు. నేటి నుంచి ఇళ్లను గుర్తిస్తారన్నారు. అనంతరం 6 నుంచి సర్వే ప్రారంభిస్తారని, ప్రజలు ఎన్యూమరేట్లకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ఏఈ (పంచాయతీరాజ్) నర్సింగ్‌రావు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నర్సయ్య

కొందుర్గు: సీసీ కెమెరాలు ఉండటంతో కొంతవరకు నేరాలను నియంత్రించడానికి అనుకూలంగా ఉంటుందని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లిలో శుక్రవారం ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉంటాయని, దొంగతనాలు చేయడానికి సహితం వెనుకడుగు వేస్తారన్నారు. ఏమైనా నేరాలు, దొంగతనాలు జరిగినా త్వరగా ఛేదించడానికి వీలుపడుతుందన్నారు. ఇందుకోసం దుకాణాల యజమానులు సొంతంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని ముఖ్య కూడలీల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం



చేవెళ్ల: బురాన్‌పూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంబరాలు

చేవెళ్ల: ప్రభుత్వం వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచటంపై గురుకుల, వసతి గృహాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలో ఉన్న గురుకుల వసతి గృహాల విద్యార్థులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఊరేళ్ల సమీపంలో గల గొల్లపల్లి వద్ద ఉన్న నవాబుపేట మండలానికి చెందిన, వికారాబాద్ జిల్లాకు చెందిన బురాన్‌పూర్, చేవెళ్లలో కొనసాగుతున్న మియాపూర్‌కు చెందిన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమకు ఎంతో సంతోషాన్ని అందించిందన్నారు. పెరిగిన ధరలకు సరిపడే విధంగా డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచటం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల ప్రిన్సిపాల్స్ రవికుమార్, నర్సింహ, సుష్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్యకారిణికి అభినందన



చిన్నారి రాజ్ఞిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: కూచిపూడి, జానపదం, నాటకాల ప్రదర్శనలో ప్రతిభ కనబరుస్తున్న చిన్నారి రాజ్ఞిని శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిన్నారి రాజ్ఞికి జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని శివమారుతీగీత అయ్యప్ప మందిరంలో ప్రధాన అర్చకుడు రవిశర్మ, మాధురి దంపతుల కుమార్తె రాజ్ఞి చిన్నప్పటి నుంచి కళలపై మక్కువ పెంచుకుంది. పట్టణంతో పాటు వైజాగ్, తిరుపతి, హైద్రాబాద్ తదితర ప్రాంతాల్లో అనేక ప్రదర్శనలను ఇచ్చింది. కళలపై ఆసక్తితో ప్రదర్శనలను ఇస్తున్న చిన్నారి రాజ్ఞి అనేక బహుమతులను అందుకుంది. చిన్నారి రాజ్ఞి చదువుతో పాటు కళల్లో రాణించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యత్‌లో ఉత్తమ ప్రదర్శనలతో రాణించి కళాప్రదర్శనలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం చిన్నారి రాజ్ఞిని ప్రోత్సహిస్తున్న సంస్కారభారతి గౌరవ అధ్యక్షుడు రంగనాథం, నవోదయ సేవాశ్రమం బాధ్యుడు రంగారెడ్డిని ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు టీవీ.రంగయ్య, సంస్కార భారతి ఉపాధ్యక్షుడు ప్రవీణ్, వడ్ల రమేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



ఏట్ల ఎర్రవల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, ఆస్పల్లిగూడ, నాందార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కు అందిస్తున్న భుజంగారెడ్డి

కొందుర్గు: మండలంలోని శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన బుయ్యని పద్మ అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.16,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు భుజంగారెడ్డి బాధితురాలికి శుక్రవారం అందజేశారు.

పోరాటంతోనే రాజ్యాధికారం సాధ్యం

డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్



షాద్‌నగర్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పోరాటాలతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం సాధ్యమని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాఘవేందర్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారం కోసం పార్టీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల హక్కుల సాధనకు పార్టీ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, భూమి, ఉపాధి, ఇళ్లు అనే ఐదు గ్యారంటీలను రూపొందించినట్లు తెలిపారు. ఈ ఐదు గ్యారంటీలతో అణగారిన వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. పేదల రాజ్యాన్ని నిర్మించేందుకు, పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం కార్యక్రమాన్ని ఈ నెల 5న ఆదిబట్లలోని కేబీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మేళానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మంచాల భిక్షపతి, గంట్లవెల్లి రాకేశ్, మహ్మద్, నర్సింహ, లాలయ్య, చిల్కమర్రి రాజు, పెంటయ్య, నరేశ్, డప్పు నరేందర్, చెన్నయ్య, సంజీవ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయండి

కేశంపేట: డీఎస్పీ మొదటి ప్లీనరీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మహిపాల్ అన్నారు. ప్లీనరీ మొదటి వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపు ఆదిబట్లలో కార్యకర్తల మహా సమ్మేళనం (ప్లీనరీ) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పీడిత ప్రజానీకం కోసం పార్టీ పని చేస్తుందన్నారు. పార్టీ నిర్మాణం, సమీక్ష, భవిష్యత్ కార్యాచరణకు మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లేశ్, రవి, శివ, శ్రీకాంత్, నందు, విష్ణు, తిరుపతి, రమేశ్, కుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య



మాట్లాడుతున్న కాంతయ్య

చేవెళ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తూ ఎత్తివేయడానికే కుట్ర చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేశ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార మార్గాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన వారు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు చెందిన వ్యవసాయ కూలీల అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉపాధిహామీని ఎత్తి వేయడానికి ప్రధాని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం సంవత్సరానికి 12వేల రూపాయలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 8 తేదీలలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశాలు శంషాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా 200ల మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో ఎర్ర జెండాలు పాతి భూపోరాటలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభులింగం, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు నాగిరెడ్డి, సీపీఐ నియోజకవర్గ, మండలాల నాయకులు సత్తిరెడ్డి, జంగయ్య, సుధీర్, మంజుల, స్వరూప, మధు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే సమస్యలు పరిష్కారం

పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



కేశంపేట: కేక్‌కట్ చేస్తున్న నర్సింహారెడ్డి, నాయకులు

కేశంపేట: ఏఐటీయూసీ వందేళ్లుగా కార్మికుల సమస్యలపై పోరాడుతూ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతోందని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సంఘం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, రవి, పారేష, జంగయ్య, రోశయ్య, అలివేలు, లింగయ్య, మైసయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

కొందుర్గు: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్మికుల హక్కులను కాలరాస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య విమర్శించారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పతకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1920లో ఏఐటీయూసీ యూనియన్ ఏర్పడిందన్నారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాటం చేసిన ఘనత ఈ యూనియన్‌దేనన్నారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ సీపీఐ మండల కార్యదర్శులు బాగళ్ల నర్సింహ, వెంకటేశ్, నాయకులు జంగయ్య, రాములు, చంద్రయ్య, రషీద్, రాజు, సువర్ణ, మల్లేశ్, లక్ష్మయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



మొయినాబాద్‌రూరల్: బాకారంలో..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో దీపావళి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని దేవాలయాల వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యాపారస్తులు, ప్రజలు దుకాణాలు, ఇళ్లకు మామిడికొమ్మలతో పాటు పూలను అలంకరించారు. మహిళలు ఇళ్లలో దొంతులు, బొమ్మల కొలువు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వ్యాపారులు దుకాణాల్లో లక్ష్మీపూజలు చేశారు. పండుగ సందర్భంగా టపాసుల షాపులు, స్వీటు షాపులు కిటకిటలాడాయి. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి, టపాసులు కాలుస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. టపాసుల మోతలతో ఆయా గ్రామాలు మార్మోగాయి.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో దుకాణాల ఎదుట టపాసులు కాలుస్తున్న యువకులు



మొయినాబాద్: సురంగల్‌లో టపాసులు కాలుస్తున్న చిన్నారులు



షాబాద్: కక్కులూర్‌లో దీపాలు వెలిగిస్తున్న కుటుంబసభ్యులు



షాబాద్: మల్లారెడ్డిగూడలో..